ప్రజాశక్తి
మంగళవారం 31 అక్టోబరు 2023
5
శ్రీకాకుళం



4న అరసవల్లి హుండీ లెక్కింపు



శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీలను నవంబరు నాలుగో తేదీన లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని అనివెట్టి మండపంలో దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో తెరవనున్నట్లు పేర్కొన్నారు.



వీడని విషాదం

- రైలు ప్రమాదంలో మూడుకు చేరిన మరణాలు
- కుశాలపురానికి చెందిన అసిస్టెంట్ లోకో పైలట్ మృతి
- జి.సిగడాంలో ఇద్దరు మహిళలు మృత్యువాత
- పలు రైళ్లు రద్దు, మళ్లింపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, జి.సిగడాం, పొందూరు

విజయనగరం జిల్లా కొత్తవలస మండలం కంటకాపల్లి-అలమండ వద్ద ఈనెల 29న సంభవించిన రైలు ప్రమాదంలో జిల్లాకు చెందిన మృతుల సంఖ్య మూడుకు చేరింది. విశాఖ-పలాస పాసింజరు రైలులో అసిస్టెంట్ లోకో పైలెట్‌గా విధులు నిర్వహిస్తున్న సువ్వారి చిరంజీవి (36), గిడిజాల లక్ష్మి(45), టంకాల సుగుణమ్మ (65) మృతి చెందారు. పలువురు గాయాలపాలై చికిత్స పొందుతున్నారు. మృతి చెందిన కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. గుర్తించిన మృతదేహాలను అధికారులు కుటుంబ సభ్యులకు అందించారు. మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకొచ్చిన అనంతరం కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. రైలు దుర్ఘటన నేపథ్యంలో జిల్లా మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేయగా, మరికొన్నింటిని దారిమళ్లించారు.

ఎచ్చెర్ల మండలం కుశాలపురానికి చెందిన అసిస్టెంట్ లోకో పైలెట్‌గా పనిచేస్తున్న సువ్వారి చిరంజీవి వృత్తి రీత్యా విశాఖపట్నంలో నివాసం ఉంటున్నారు. తల్లిదండ్రులు [illegible], అమ్మాజీ ప్రస్తుతం కుశాలపురంలోనే ఉంటున్నారు. అసిస్టెంట్ లోకో పైలెట్‌గా చిరంజీవి డ్యూటీకి వెళ్లిన విశాఖ-పలాస పాసింజరు రైలు ప్రమాదానికి గురైందన్న వార్త తెలిసిన వెంటనే భార్య జ్యోత్స్నతో కలిసి తల్లిదండ్రులు, బంధువులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే చిరంజీవి మృతదేహాన్ని విజయనగరం ఆస్పత్రికి తరలించడంతో అక్కడకు వెళ్లారు. విగతజీవిగా పడి ఉన్న చిరంజీవి మృతదేహాన్ని చూసి భోరున విలపించారు. విజయనగరం ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసిన తర్వాత అధికారులు సోమవారం ఉదయం మృతదేహాన్ని అప్పగించడంతో, స్వగ్రామానికి తీసుకొచ్చి సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య జ్యోత్స్నతో పాటు రెండేళ్ల కుమారుడు నవదీప్ ఉన్నాడు. మృతునికి మూడేళ్ల కిందటే వివాహమైంది. విశాఖపట్నంలోని ఒక ప్రయివేట్ కళాశాలలో బిటెక్ చదివారు. రైల్వేశాఖ నిర్వహించిన లోకో పైలెట్ పరీక్షల్లో ఎంపికై 2013లో విధుల్లో చేరారు. భర్త మరణంతో భార్య జ్యోత్స్న కన్నీరుమున్నీరుగా రోదిస్తోంది. ఏకైక కుమారుడు మృతి చెందారన్న వార్తను జీర్ణించుకోలేక తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. భార్య, తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు. చిరంజీవి మృతితో కుశాలపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఫంక్షన్‌కు వెళ్లి వస్తూ ఇద్దరు మృత్యువాత

విశాఖపట్నంలో ఒక ఫంక్షన్‌కు వెళ్లిన వారిలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. పలువురు గాయాలపాలయ్యారు. జి.సిగడాం మండలం ఎస్‌పిఆర్ పురం అగ్రహారానికి చెందిన గిడిజాల లక్ష్మి (45), మెట్టవలసకు చెందిన టంకాల సుగుణమ్మ (65) మృతి చెందారు. టంకాల సుగుణమ్మ భర్త సన్యాసినాయుడు చాలా ఏళ్ల కిందటే మరణించారు. కొడుకు ఆదాం పాలకొండలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. మృతురాలు ఒక్కరే గ్రామంలో ఉంటున్నారు. గిడిజాల లక్ష్మి ప్రమాదం సంభవించిన వెంటనే మృతి చెందిన విషయం విదితమే. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం స్వగ్రామాలకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాలను చూసిన గ్రామస్తులు కన్నీటిపర్యంతమయ్యారు.


సువ్వారి చిరంజీవి


టంకాల సుగుణమ్మ


గిడిజాల లక్ష్మి


జి.సిగడాం : సుగుణమ్మ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

రైలు ప్రమాద దుర్ఘటనలో జిల్లాకు చెందిన పలువురు గాయపడ్డారు. జి.సిగడాం మండలానికి గాయపడిన మజ్జి సూర్యకాంతం, కీర్తి రాములమ్మ, మహంతి ఆదిలక్ష్మి, మహంతి తేజేశ్వని, మజ్జి అమృత, మజ్జి మోక్ష, మజ్జి రమణ విజయనగరం, కొత్తవలస ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పొందూరు మండలం బొడ్డేపల్లికి చెందిన బొడ్డేపల్లి తేజేశ్వరరావుకు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. ఆయనకు విశాఖపట్నంలోని రైల్వే ఆస్పత్రిలో చికిత్సను అందిస్తున్నారు. పని మీద విశాఖపట్నం వెళ్లిన ఆయన రైలులో తిరిగి వస్తుండగా ప్రమాదంలో గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమదాలవలస మండలం బెలమాంకు చెందిన పంచాది శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలు కాగా విశాఖ రైల్వే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ప్రజాప్రతినిధుల పరామర్శ

రైలు ప్రమాదంలో జిల్లాకు చెందిన పలువురు గాయపడిన నేపథ్యంలో వైసిపి, టిడిపికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు విజయనగరం ఆస్పత్రిని సందర్శించి రోగులను పరామర్శించారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు, నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. గాయపడిన వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జి.సిగడాం తహశీల్దార్ వేణుగోపాలరావు, ఆర్ఐ రామచంద్రరావు విజయనగరం ప్రాంతీయ ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు.

పలు రైళ్లు రద్దు, దారిమళ్లింపు

రైలు ప్రమాద దుర్ఘటన నేపథ్యంలో జిల్లా మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేశారు. భువనేశ్వర్-ముంబై (కోణార్క్) ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు. కొన్నింటిని వేరే మార్గంలో పంపిస్తున్నారు. ముంబై-భువనేశ్వర్ రైలును విజయవాడ నుంచి మళ్లించారు. మరికొన్నింటిని ఆ మార్గంలోనే పంపిస్తున్నారు. ఒకే ట్రాక్‌కు క్లియరెన్స్ ఇవ్వడంతో షెడ్యూల్ కంటే ఐదారు గంటలు ఆలస్యంగా రైళ్లు నడుస్తున్నట్లు రైల్వే అధికారులు చెప్తున్నారు. హౌరా-సికింద్రాబాద్ (ఫలక్‌నుమా) ఎక్స్‌ప్రెస్ శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌కు రాత్రి 8.13 గంటలకుకు రావాల్సి ఉండగా, అర్ధరాత్రి 12 తర్వాత వచ్చింది. దూర ప్రాంత రైళ్ల రాకపోకలకు వీలుగా పలు పాసింజర్ రైళ్లను రద్దు చేశారు. రద్దయిన వాటిలో పలాస-విశాఖపట్నం పాసింజర్ స్పెషల్, విశాఖ-గుణుపూర్, గుణుపూర్-విశాఖ, పలాస-విశాఖపట్నం స్పెషల్‌ను రద్దు చేశారు. భువనేశ్వర్-విశాఖ, బరంపురం -విశాఖ నుంచి వెళ్లే ఇంటర్‌సిటీ రైళ్లను రద్దు చేశారు.

నేడు భువనేశ్వరి రాక

- రేపు ఆమదాలవలస నియోజకవర్గంలో 'నిజం గెలవాలి'
- టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఈనెల 31న సాయంత్రం శ్రీకాకుళం నగరానికి చేరుకుంటారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ తెలిపారు. 'నిజం గెలవాలి'లో భాగంగా ఆమదాలవలస నియోజకవర్గంలో చంద్రబాబు అరెస్టుతో మనస్తాపానికి గురై మృతి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానుల కుటుంబాలను పరామర్శిస్తారని చెప్పారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భువనేశ్వరి పర్యటనా వివరాలను వెల్లడించారు. 31న శ్రీకాకుళం నగరానికి చేరుకుంటున్న భువనేశ్వరి రాత్రి అక్కడే బస చేస్తారని తెలిపారు. నవంబరు ఒకటో తేదీ ఉదయం పది గంటలకు మండలంలోని దన్నానపేటలో గొర్లె తిరుపతిరావు కుటుంబాన్ని పరామర్శిస్తారని తెలిపారు. అక్కడ్నుంచి సంత కొత్తవలస మీదుగా బూర్జ మండలం తోటాడ చేరుకుని గేదెల సాంబమూర్తి కుటుంబాన్ని పరామర్శిస్తారని చెప్పారు. అనంతరం కొల్లివలస, లాబాం, గుత్తావల్లి, జికె వలస మీదుగా పాత నిమ్మతొర్లాడ చేరుకొని ఆకేటి పారయ్య, గొండు ఎర్రయ్య కుటుంబాలను పరామర్శిస్తారని చెప్పారు. అక్కడ్నుంచి ఆమదాలవలస పట్టణంలోని టిడిపి కార్యాలయానికి చేరుకుంటారని తెలిపారు. భోజన విరామం అనంతరం పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం మూడు గంటలకు మహిళలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. భువనేశ్వరి పర్యటనను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.


సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ఓటర్ల నమోదుకు ప్రత్యేక క్యాంపులు

- 15 రోజుల్లోగా క్లయిమ్‌లను పరిష్కరించాలి
- బిఎల్‌ఒలను ఆదేశించిన కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఓటర్ల నమోదుకు నవంబర్ 11, 12, డిసెంబర్ 2, 3 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వెల్లడించారు. ఓటరుగా నమోదు కాని 18 ఏళ్లు దాటిన వారు నమోదు చేసుకోవాలని కోరారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 27 వేల క్లయిమ్‌ల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బిఎల్‌ఒలు, ఎఇఆర్‌ఒలు, ఇఆర్‌ఒలతో సోమవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. క్లయిమ్‌ల పరిష్కారానికి 15 రోజుల గడువు విధిస్తున్నామన్నారు. గడువు కంటే ముందే వాటిని పూర్తి చేసేలా పనిచేయాలన్నారు. ఫారం-7 అప్లికేషన్లను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసువాలని సూచించారు. ఓటర్ల నమోదుకు బూత్ లెవల్ అధికారులతో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్న దృష్ట్యా ఆయా కేంద్రాల్లో ఎన్నికల విధులకు సంబంధించిన అధికారుల ఫోన్ నంబర్లతో కూడిన జాబితాను స్పష్టంగా కనిపించేలా ఉంచాలని ఆదేశించారు. ఆయా రోజుల్లో వచ్చే క్లయిమ్‌లతో సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున, ఏ చిన్న పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకతతో సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న 27వేల క్లయిమ్‌ల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఓటర్లకు సంబంధించిన వెబ్‌సైట్, ఎన్నికల కమిషన్ రూపొందించిన యాప్‌ల గురించి ఓటరుకు అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా యూనివర్సిటీలు, డిగ్రీ కళాశాలల్లో 18 ఏళ్లు నిండిన అర్హత కలిగిన వారికి ఓటు హక్కు కల్పించేలా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో కొత్త ఓటర్ల నమోదుకు కృషి చేయాలన్నారు. ఒకే ఇంటి నంబరుతో పది కంటే ఎక్కువ ఓట్లు ఉన్న ఇళ్లను గుర్తించి, వచ్చే 15 రోజుల్లో విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. బిఎల్‌ఒ స్థాయి నుంచి ఎఇఆర్‌ఒ, ఇఆర్‌ఒ స్థాయిలో ఫిర్యాదుల పరిష్కారానికి వ్యక్తిగతంగా ఐదు కంటే ఎక్కువ ఫిర్యాదులను అంగీకరించవద్దని స్పష్టం చేశారు.



అసమానతల్లేని అభివృద్ధికి ప్రజా రక్షణ భేరి

ఎచ్చెర్ల : అసమానతల్లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపడుతున్న ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు పిలుపునిచ్చారు. ఎచ్చెర్లలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ యాత్రను నవంబరు రెండో తేదీన మందసలో సిపిఎం అఖిల భారత నాయకులు విజూ కృష్ణన్ ప్రారంభిస్తారని తెలిపారు. లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతల్లేని అభివృద్ధికి సిపిఎం ఆధ్వర్యాన మూడు చోట్ల బస్సు యాత్రలు ప్రారంభమై రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తూ నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు అత్యధిక ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మత విద్వేషాలు సృష్టిస్తున్న బిజెపి ప్రభుత్వం దేశ సంపదనంతా అదానీ, అంబానీలకు దోచిపెడుతోందని విమర్శించారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు అంటకాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, ఖాళీగా ఉన్న రెండున్నర లక్షల ఉద్యోగాలు భర్తీ, మూతపడిన పరిశ్రమలు తెరిపించడం, ధరలు అదుపు చేయడం, వంటగ్యాస్ ధర 400, పెట్రోల్, డీజిల్ లీటరు రూ.60కే ఇవ్వడం, పేదలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించడం, మెగా డిఎస్‌సి, నిరుద్యోగ భృతి రూ.ఐదు వేలు, రైతులకు గిట్టుబాటు ధర, అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం, కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్ తదితర హామీలు అమలు వంటి వాటితో కూడిన ప్రజా ప్రణాళికను సిపిఎం ప్రజల ముందుంచుతుందని తెలిపారు. వీటితో పాటు కనీస వేతనం రూ.26 వేలు, స్కీమ్‌వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, పేదలకు 300 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, మైనార్టీల హక్కుల పరిరక్షణ, రిజర్వేషన్లు అమలు, వృత్తిదారుల ఉపాధి భద్రత, మహిళలకు రక్షణ, ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, రైల్వేజోన్, విభజన హామీల అమలు ప్రజా ప్రణాళికలో ఉన్నాయన్నారు. ఇవి అమలయ్యే విధంగా సిపిఎంను బలపరచాలని విజ్ఞప్తి చేశారు. వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం నాయకులు సిహెచ్.అమ్మన్నాయుడు, టి.నందోడు, పొందూరు చందరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవిందరావు

అభివృద్ధి దిశగా పరుగులు

ప్రజాశక్తి - బూర్జ

అన్ని రంగాల్లోనూ రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సుమారు రూ.2.20 కోట్లతో కొల్లివలస నుంచి పాలకొండ వరకు ఆర్అండ్‌బి రహదారి అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి సమపాళ్లలో అమలు చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్టు వివరించారు. అన్ని సంక్షేమ ఫలాలను ప్రజల ముంగిటకు తీసుకొచ్చిన ఏకైక సిఎం జగన్ అని కొనియాడారు. కుల, మత, ప్రాంత విభేదాలకు తావులేకుండా అవినీతి రహిత పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ దేశానికే తలమానికంగా నిలిచిందన్నారు. ఉద్దానం కిడ్నీ బాధితులను ఆదుకోవడంతో పాటు విమానాశ్రయాలు, నౌకాశ్రయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారని తెలిపారు. ప్రజల్లో తన స్థానాన్ని మరింత పదిలపరుచుకొని ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాల పథకాలను అమలు చేస్తూ నాలుగేళ్లుగా ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, ఎంపిపి ప్రతినిధి కర్నేన నాగేశ్వరరావు, టిడ్కో డైరెక్టర్ కండాపు గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుమ్మడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



అమరుల కుటుంబాలు పరామర్శ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరులైన పోలీసు కుటుంబాలను డిఎస్‌పి బాలచంద్రారెడ్డి సోమవారం పరామర్శించారు. ఎస్‌పి జి.ఆర్ రాధిక పర్యవేక్షణలో నిర్వహిస్తున్న అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా జిల్లాకు చెందిన అమరులైన ఎం.నరేంద్ర దాస్, ఎ.పాపారావు కుటుంబసభ్యులను శ్రీకాకుళం నగరంలోని వారి నివాసాల్లో డిఎస్‌పి పరామర్శించారు. అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నరేంద్ర దాస్, పాపారావు అందించిన సేవలను కొనియాడారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చి జ్ఞాపికలను అందజేశారు.



ఆలయ భూములను సంరక్షించాలి

- మాజీ జెడ్‌పిటిసి ఆనెపు రామకృష్ణ ఫిర్యాదు
- 'స్పందన'కు 260 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బూర్జ మండలం పెద్దపేట పంచాయతీ పరిధిలోని జగన్నాథ స్వామి ఆలయ భూములను పరిరక్షించాలని మాజీ జెడ్‌పిటిసి ఆనెపు రామకృష్ణ, సర్పంచ్ వరలక్ష్మి కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను కోరారు. ఆలయ భూములను జిరాయతీ భూములుగా రీ సర్వే సమయంలో రికార్డుల్లో నమోదు చేసుకుంటున్నారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా పలు వ్యక్తిగత, సామాజిక సమస్యలపై 260 వినతులు వచ్చాయి. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ వినతులు స్వీకరించారు. నరసన్నపేట పట్టణంలోని శివాజీ నగర్‌లో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని కొందరు అధికార పార్టీకి చెందిన నాయకులు భవనాలు నిర్మిస్తున్నారని, ఈ ఆక్రమణలను తొలగించాలని ఎం.రామారావు ఫిర్యాదు చేశారు. గార మండల కేంద్రంలో జనావాసాల నడుమ మద్యం దుకాణాన్ని నిర్వహిస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే దుకాణాన్ని తొలగించాలని దుర్గారావు, కిషోర్, చలపతిరావు, రామకృష్ణ తదితరులు వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళం నగరంలోని చాపురం, బలగ, సిద్ధిపేట ప్రాంతాల్లో కోర్టు ఆదేశాలను సైతం లెక్క చేయకుండా కొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నారని, ఈ ఆక్రమణలను తొలగించాలని ఎస్.లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కారం

స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో వస్తున్న ఫిర్యాదులపై అలసత్వం లేకుండా నిర్ణీత కాలవ్యవధిలో సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కారం చూపాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం అధికారులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితర సమస్యలపై శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. ఎక్కడైనా ఫిర్యాదుదారుడు ఇచ్చిన వినతుల్లో సమగ్రత లోపిస్తే ఆయనకు పూర్తి సమాచారాన్ని అందించి తిరస్కరించడానికి గల కారణాలు తెలియజేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు, సమగ్ర శిక్ష ఎపిసి జయప్రకాష్, డ్వామా పీడీ చిట్టిరాజు, డిఇఒ వెంకటేశ్వరరావు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ఫిర్యాదులు పునరావృతం కారాదు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

స్పందన ఫిర్యాదులపై శాశ్వత పరిష్కారం చూపాలని, పునరావృతం కాకుండదని పోలీసు అధికారులను ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్‌పి టి.పి.విఠలేశ్వరరావుతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా 45 ఫిర్యాదులను స్వీకరించారు. ఇందులో కుటుంబ తగాదాలకు 5, పౌర సంబంధమైనవి 16, మోసపూరితమైనవి 3, సైబర్ నేరం ఒకటి, పాతవి 7, ఇతర ఫిర్యాదులు 13 వచ్చాయి. ఫిర్యాదుదారుల సమస్యలను పరిశీలించి సంబంధిత పోలీస్‌స్టేషన్ పరిధిలోని అధికారులకు తక్షణమే ఫోన్ కాల్ ద్వారా సమాచారం అందించారు. ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ చేపట్టి నిర్దేశించిన గడువులోగా త్వరితగతిన పరిష్కరిస్తామని ఫిర్యాదుదారులకు భరోసానిచ్చారు.

పేదలకు వరం 'ఆరోగ్య సురక్ష'



నరసన్నపేట: పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

ప్రజాశక్తి- నరసన్నపేట

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని బొరిగివలస సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబమూ దగ్గరకు వైద్యులను, ఆరోగ్య కార్యకర్తలను పంపించడం గొప్ప విషయమని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం అన్ని బాగున్నప్పుడే ఆ రాష్ట్రాభివృద్ధి పథంలో ఉంటుందని, మన రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతిని సాధించిందని వివరించారు. ముందుగా కృష్ణదాస్ ఆరోగ్య సురక్ష శిబిరంలో బిపి, సుగర్, పరీక్షలను చేయించుకున్నారు. అనంతరం పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు.

కవిటి: ప్రజారోగ్యంపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలంలోని జగతిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొన్నారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన స్టాల్ పరిశీలించి పోషణ కిట్లు అందించారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియా ప్రకాష్, సర్పంచ్ పూడి ప్రసాదరావు, వైస్ ఎంపిపి పూడి నేతాజీ, ఎంపిటిసి డి.సతీష్, ఎన్ని అశోక్, తహశీల్దార్ పి.శేఖర్, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, డిటి రామచంద్రరావు, ఐసిడిఎస్ సిడిపిఒ నాగరాణి, ఎపిఎం గోవిందరావు, అంగన్వాడీ సూపర్ వైజర్లు కృష్ణవేణి, పల్లవి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని రెయ్యిపాడులో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు పాల్గొన్నారు. డాక్టర్ సుధీర్ ఆధ్వర్యాన వైద్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి మద్దిలి హరినారాయణ, సర్పంచ్‌లు బచ్చల ధర్మారావు, బత్తిన ప్రసాదరావు, తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఇఒపిఆర్‌డి డి.తిరుమలరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ గంగమ్మ పాల్గొన్నారు.

నందిగాం: మండలంలోని శివరాంపురంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షను కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి ప్రారంభించారు. అనంతరం వైద్య శిబిరం, స్టాల్స్, డ్వాక్రా వస్తు ప్రదర్శనను పరిశీలించారు. వృద్ధులకు కళ్లద్దాలు, రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాలక మధుసూదనరావు, ఎంపిటిసి పిన్నింటి జయరాం, అంబోడి విష్ణు, ఎంపిడిఒ శివప్రసాద్, డిటి ధనలక్ష్మి, సర్పంచ్‌లు సబ్బి జానకిరామ్, శంభాన దానయ్య బొమ్మాలి గున్నయ్య పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మండలంలోని మాసాహెబ్‌పేటలో సర్పంచ్ సంపతిరావు ధనలక్ష్మి ఆధ్వర్యాన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణిలు పాల్గొన్నారు. వైద్యులు 302 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే కమలనాభపురంలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో భాగంగా అంగన్వాడీలు ఏర్పాటు పౌష్టికాహార స్టాల్స్ ప్రదర్శనను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, డిటి ఆర్.మధు, మండల విద్యాశాఖాధికారి ఎల్.వి.ప్రతాప్, గడ్డపలస నాగభూషణరావు పాల్గొన్నారు.



పొందూరు: మందులను అందజేస్తున్న నాయకులు

పొందూరు: మండలం కొంచాడ గ్రామంలో తాడివలస పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన 324 మందికి వైద్య పరీక్షలు జరిపి మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల అహారాద, ఎంపిటిసి పెయ్యల సరస్వతి, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, వైసిపి మండల జెసిఎస్ బాధ్యుడు బాడాన వెంకట కృష్ణారావు, వైసిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి బండారు జైప్రతాప్‌కుమార్, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, వైద్యాధికారులు బి.రమేష్ నాయుడు, మల్లీశ్వరమ్మ, రాజేశ్వరరావు, ఎస్.జ్యోత్స్న, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



రోదిస్తున్న కుటుంబసభ్యులు (ఇన్‌సెట్‌లో సన్యాసిరావు ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

లావేరు: మండలం జాతీయ రహదారి బెజ్జిపురం కూడలిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే గ్రామానికి చెందిన గొర్లె సన్యాసిరావు (57) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... బెజ్జిపురం గ్రామం నుంచి సన్యాసిరావు గొర్లెపేట తన బంధువులను పరామర్శించేందుకు రహదారి దాటుతున్న సమయంలో శ్రీకాకుళం వైపు నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి వరకు కుటుంబ సభ్యులతో పాటు గ్రామంలో సరదా గడిపిన సన్యాసిరావు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కొన్నాళ్ల కిందట పెద్ద కుమారుడు మృతి చెందగా, ఇప్పుడు భర్త మృతి చెందడంతో భార్య సన్యాసమ్మ, ఇద్దరు పిల్లలు బోరున విలపిస్తున్నారు. ఇప్పుడు మా కుటుంబాన్ని ఎవరు ఆదుకుంటారని కన్నీటి పర్యాతమవుతున్నారు. సమాచారం తెలుసుకున్న లావేరు పోలీసులు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సి రామారావు తెలిపారు.

మనమడే కాలయముడు

మందస/పలాస : మందస మండలం చిన్నలోహరిబందకు చెందిన తామాడ కాకమ్మను హత్య చేసి ఆమె ముక్కు, చెవిలో ఉన్న బంగారు ఆభరణాలు దోచుకున్న సంఘటనలో తామడ భువనేశ్వరావును అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు మందస పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మృతురాలు కాకమ్మకు ముగ్గురు కుమారులు ఉన్నారని అన్నారు. పెద్ద కుమారుడుకే డబ్బులు, బంగారం, ఆస్తి అధికంగా ఇచ్చి అతనే మంచి వాడిని, మిగిలిన ఇద్దరు కుమారులూ సక్రమంగా తనను చూడరని గ్రామంలో అందరికీ చెప్పేదని తెలిపారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకొని రెండో కుమారుడు తామడ లోకనాథం కుమారుడు భువనేశ్వరావు ఈ నెల 25న గ్రామానికి సమీపంలో ఉన్న బచ్చల నాగమ్మకు చెందిన జీడి తోటలో కాకమ్మను హత్య చేసి బంగారం వస్తువులతో పరారయ్యాడని తెలిపారు. హత్య సంఘటనపై కాకమ్మ పెద్ద కుమారుడు తామడ రమణమూర్తి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని అన్నారు. ఈ కేసు దర్యాప్తు ఎఎస్‌పి టి.పి.విఠలేశ్వరరావు పర్యవేక్షణలో కాశీబుగ్గ రూరల్ ఇన్‌ఛార్జి సిఐ ఆర్.సిహెచ్.ప్రసాదరావు, సిసిఎస్ బృందాలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కేసును ఛేదించామని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.



ఆందోళన చేస్తున్న నాయకులు

కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి- నందిగాం

నందిగాం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సిపిఎం నాయకులు సాంబమూర్తి, ఎపి రైతు సంఘం నాయకులు బి.వి.వాసుదేవరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ వై.వి.పద్మావతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరుగాల శ్రమించి ఎకరాకు రూ.25 వేలు పెట్టుబడి పెట్టారని అన్నారు. పొట్ట దశలో ఉండటంతో వంశధార నీరు రాకపోవడం, 70 రోజులుగా వర్షాలు కురకపోవడంతో పంటలు పూర్తిగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నందిగాం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.బాలయ్య, వి.సింహాచలం పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో రోడ్ క్రాసింగ్ లైన్‌లో స్తంభాలు వేసి తీగలను అమర్చుటకు బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని డాబాలవారి వీధి, పాతిన వారి వీధి కొంత భాగం, మొనింగి వారి వీధి కొంత భాగం, పాలపోలమ్మ ఆలయం, కామేశ్వరి కళ్యాణ మండపం, పోలీసుస్టేషన్, కొత్తకోటవారి వీధి, కోర్టు, చంద్రయ్యపేట గ్రామస్తులు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

శీతల కొండ పరిశీలన

ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

'శీతల కొండలో ఏం జరుగుతోంది' అంటూ శనివారం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. రెవెన్యూ, మైన్స్, పోలీస్ శాఖల అధికారులు సోమవారం శీతల కొండకు చేరుకుని అక్కడ జరుగుతున్న క్రషర్ పనులు పరిశీలించారు. గతంలో ఈ పనులు ఎవరు నిర్వహించారు... ప్రస్తుతం ఎవరు చేస్తున్నారు వివరాలు తెలుసుకున్నారు. సుమారు 6.54 ఎకరాల్లో జరుగుతున్న ఈ క్రషర్ పనులకు ఉన్న అనుమతులు, పరిసర ప్రాంతాలకు, కొండకు మధ్య ఉన్న దూరం పరిశీలించారు.



శీతల కొండను పరిశీలిస్తున్న అధికారులు

అనంతరం కొండలో బ్లాస్టింగ్ చేసే సమయంలో మరోసారి పరిశీలించి, పరిసర ప్రాంతాలపై దాని ప్రభావం ఎంతనేది ప్రత్యక్షంగా పరిశీలించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.శేఖర్, ఎస్‌ఐ కె.రాము, మైనింగ్ సిబ్బంది నాగేంద్ర, ఆర్‌ఐ రమణమూర్తి, విఆర్‌ఒలు పూడి కల్పన, దామోదర్, శివ పాల్గొన్నారు.



ఢిల్లీకి మట్టి కుండలను చేర్చిన షణ్ముఖరావు

ఢిల్లీకి చేరిన కోటబొమ్మాళి మట్టి

కోటబొమ్మాళి: ప్రధానిమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు నాభూమి- నాదేశం కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలో అమృత సరోవనం నిర్మించడానికి కోటబొమ్మాళి ఎన్‌ఆర్‌ఇజిఎస్ సేకరించిన మట్టి సోమవారానికి ఢిల్లీకి చేరుకుంది. మండలంలోని 38 గ్రామ పంచాయతీల పరిధిలోని ఉపాధి ఉపాధి క్షేత్రసహాయకులు సేకరించిన మట్టిని ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, ఉపాధిహామి ఎపిఒ జి.హరిప్రసాద్‌లు ఎత్తురాళుపాడు పంచాయతీకి చెందిన ఉపాధి హామీ క్షేత్రసహాయకుడు ఎన్.షణ్ముఖరావుతో ఢిల్లీకి పంపించారు.

సరిచేసిన విద్యుత్ వైర్లు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

బూర్జ: ఎట్టకేలకు అల్లెన పంచాయతీ ప్రజలకు విద్యుత్ సమస్యలు తీరాయి. మండలంలోని అల్లెన పంచాయతీ ఏర్పాటైనప్పటి నుంచి విద్యుత్ లైన్‌మేన్ లేకపోవడంతో గ్రామస్తులతో పాటు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ సమస్యపై ఇటీవల ప్రజాశక్తిలో 'విద్యుత్ కష్టాలు తీరేదెప్పుడో' అనే కథనం ప్రచురితమవ్వడంతో అధికారులు స్పందించారు. విద్యుత్ శాఖాధికారులు సోమవారం గ్రామానికి చేరుకొని ఇటీవల శ్మశాన వాటికకు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు కిందకు ఒరగడంతో సరిచేశారు. అలాగే వైర్లు వేలాడుతూ ఉండడంతో వాటిని సరిచేసి ప్రమాదాలను నివారించారు. విద్యుత్ శాఖ ఎఇ అప్పన్న ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. గ్రామ సర్పంచ్ ప్రతినిధి జడ్డు మహేశ్వరరావు, రైతులు ఉన్నారు.



విద్యుత్ వైర్లను సరిచేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు



దహన సంస్కారాలు నిర్వహిస్తున్న హాసిని

తండ్రికి తనయ తలకొరివి

కవిటి: అల్లారుముద్దుగా చూసుకుంటున్న కన్నతండ్రి ఆకస్మికంగా కన్ను మూయడంతో కన్నీటి వీడ్కోలు పలికారు ఆ చిన్నారులు. కొడుకులు లేకపోవడంతో తండ్రికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుందా తనయ. కవిటి గ్రామానికి చెందిన నెయ్యల రమేష్ (42) బ్రెయిన్ స్ట్రోక్ తో సోమవారం కన్నుమూశాడు. దీంతో అతని భార్య మాధురి, ఇద్దరు కుమార్తెలు హాసిని (13), స్నేహ(7) రమేష్ పార్థవదేహంపై పడి కన్నీరుమున్నీరుగా విలపించడం స్థానికుల మదిని కలచివేసింది. రమేష్‌కు కుమారులు లేకపోవడంతో దహన సంస్కారాలు ఎవరు చేస్తారనే సందిగ్ధంలో ఉండగా... పెద్ద కుమార్తె హాసిని తానున్నానంటూ ముందుకొచ్చింది. అంతిమ సంస్కారాలు చేసి తండ్రికి తలకొరివి పెట్టింది. తమ గ్రామంలో మొదటిసారిగా కూతురు దహన సంస్కారాలు నిర్వహించిందని, ఎప్పుడూ నవ్వుతూ, నలుగురితో కలిసిపోయే రమేష్ ఇకలేడనే మాట తమ మదిని కలచివేస్తోందని స్థానికులు, స్నేహితులు తెలిపారు.



క్రీడాకారులను అభినందిస్తున్న వెంకటరావు

కరాటేలో క్రీడాకారుల సత్తా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


నిరంతరం శిక్షణ పొందుతున్నప్పుడే విజయం వైపు నడిచేందుకు ఆస్కారం ఉంటుందని జెఎన్‌టియు సెనేట్ మెంబర్ దుప్పల వెంకటరావు అన్నారు. శిక్షణ పొందినంత మాత్రాన విజేత కాలేరని, క్రీడాకారులు నిరంతరం అభ్యసిస్తూ మెళకువలు నేర్చుకున్నప్పుడే పతకాలు అందుకుంటారన్నారు. మాస్టర్స్ సాయిబాబాస్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన జిల్లాకు చెందిన క్రీడాకారులు ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రెండో అంతర్జాతీయ డ్రాగన్ ఫీస్ట్ జోటోకాన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను ఆయన అభినందించారు. నగరంలోని అఫీషియ్ కాలనీలో ఎపిజె అబ్దుల్ కలాం పార్కులో క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడల్స్ సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ సిక్కోలు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పథకాలు అందుకున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని కరాటే క్రీడాకారులు ముందుకు సాగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, చీఫ్‌కోచ్ చంద్రరావు, కోచ్ గాయత్రీ, వాకర్స్ ఇంటర్నేషనల్ 102 డిప్యూటీ గవర్నర్ కొంక్యాన మురళీధర్, రిటైర్డ్ డిసిటిఒ కామరాజు, రిటైర్డ్ ఎస్‌బిఐ మేనేజర్ జగన్నాథరావు, ఇరిగేషన్ అధికారి జ్ఞానభాస్కర్, హనుమంతు తులసమ్మ ఉన్నారు.

ఎంపీ పరామర్శ

నందిగాం: మండలంలోని నందిగాంలో ప్రగడ పాపేసు, కాపుతెంబూరులో కె.ముఖలింగం, కె.పొట్టెన్నలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు సోమవారం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అంతకుముందు అనారోగ్యానికి గురైన అట్టాడ ప్రభాకరరావు నాయుడును పరామర్శించి క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కె.వరప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు అజయ్‌కుమార్ ఉన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

టెక్కలి: కోటబొమ్మాళి మండలం దుప్పిలిపాడు గ్రామ రెవెన్యూ పరిధి కొప్పలపేటలోని పలు ప్రభుత్వ స్థలాలు దురాక్రమణకు గురయ్యారని, వాటిని తొలగించాలని గ్రామానికి చెందిన కణితి మల్లయ్య కోరారు. ఈ మేరకు టెక్కలి సబ్ కలెక్టర్ నూరల్ కమర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామాలోని భుక్త చెరువు, కురమన్నపూను వంటి చెరువులను కొంతమంది ఆక్రమించుకుని పంటపోలాలు చేసుకోగా, మరికొంత మంది కోళ్ల ఫారాలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. సుమారు 30 ఎకరాల ప్రభుత్వ స్థలం ఆక్రమణలో ఉందన్నారు. ఇదే విషయమై గతంలో పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం రాలేదన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న మల్లయ్య

ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దు



సమీక్షిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- పోలాకి

ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టినప్పుడు ప్రజలను ఇబ్బందికి గురి కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గాతలవలస సర్పంచ్ మెండ శ్రీనివాసరావు అన్నారు. మణ్డలంలోని వై.బి.వలసలో పంచాయతీ అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాతలవలసలో జలజీవన్ మిషన్ ద్వారా వేసిన బోరు సరైన స్థలంలో వేయలేదని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పంచాయతీ అధికారులు అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా కాకుండా ప్రజాప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భూ రీసర్వేలో సరిహద్దు రాళ్లు పాతినప్పుడు రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం పంచాయతీలో ఓటర్ జాబితాను పరిశీలించారు. కార్యక్రమంలో విఆర్‌ఒ కాల్ల నర్సింహులు, కార్యదర్శి సూర్యనారాయణ, విఎఎ కె.భానుప్రకాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్వర్ణమణి

పన్నుల వసూలులో ఒత్తిడి వద్దు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపల్ ఆస్తి పన్నులు వసూలులో సిబ్బంది ఒత్తిడికి గురిచేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన సోమవారం కౌన్సెల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్తి పన్నులు వసూలులో ప్రజలకు కనీసం గడువు ఇవ్వకుండా ఒత్తిడికి గురి చేయడం సరికాదన్నారు. దీనిపై కమిషనర్ రమేష్ సమాధానం ఇస్తూ... ఆస్తి పన్నులు బకాయిలు పేరుకుపోవడం ఉన్నత అధికారుల నుంచి తమకు ఒత్తిడి వస్తుందని, దీనివల్ల వసూలులో ముమ్మరం చేస్తున్నామని అన్నారు. మున్సిపల్ మేనేజర్ తీరు బాగాలేదని, ప్రజాప్రతినిధులైన తమ మాటకూ స్పందించడం లేదని స్వర్ణమణి ఫిర్యాదు చేశారు. ఎవ్వరితో ఎలా ఉండాలో తెలియని వ్యక్తికి మెమో ఇవ్వాలన్నారు. ఇచ్ఛాపురంలో అనేక మంది డీపట్టా భూముల్లో ఇళ్లు కట్టుకున్న వ్యక్తులకు మున్సిపల్ పన్నులు కేటాయించాలని కోరుతున్నారని 11 వార్డు కౌన్సిలర్ ఆసీ లీలారాణి సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని ఈ అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ సమాధానమిచ్చారు. వీధి దీపాలు నిర్వహణకు సంబంధించిన పూర్తిస్థాయి మెటీరియల్ సిద్ధంగా ఉండాలని లీలారాణి సూచించారు. తమ వార్డులో తాగునీరు సక్రమంగా రావడం లేదని, పూర్తిస్థాయి నీరు అందేలా చర్యలు తీసుకోవాలని వార్డు కౌన్సిలర్ ప్రదీప్ కోరారు. ఇదే సమస్య అనేక వార్డుల్లోనూ ఉందని స్వర్ణమణి అన్నారు. బాహుదా నదిలో బురద మట్టి పేరుకుపోయిందని, వాటిని తొలగించేందుకు రూ.8 లక్షలు ఖర్చు అవుతుందని కమిషనర్ తెలిపారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ బురద మట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతీ దివ్య, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ సుల్తాన్, సాలీనా ఢిల్లీ పాల్గొన్నారు.

టిడిపి పూర్వ వైభవానికి కృషి

వజ్రపుకొత్తూరు : టిడిపి పూర్వ వైభవానికి కార్యకర్తలు కృషి చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతు శిరీష పిలుపునిచ్చారు. టిడిపి కార్యాలయంలో క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవంబరు 1 నుంచి ప్రారంభమయ్యే బాబుతో నేను... బాబు ష్యూరిటి, భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం గురించి వివరించారు. ప్రతి యూనిట్ ఇన్‌ఛార్జిల పరిధిలోనిగ్రామ కమిటీ బూత్ లెవెల్ ఏజెంట్లతో ప్రతి కుటుంబాన్నీ కలవాలన్నారు. చంద్రబాబు అక్రమను అక్రమంగా ప్రభుత్వం అరెస్టు చేసిందని ప్రజలకు వివరించాలన్నారు. టిటిపి అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సురాడ మోహనరావు, మాజీ ఎంపిపి గోరకల వసంత రావు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు పుచ్చ ఈశ్వరరావు, పి.విఠల్, గోవింద, పాపారావు, కిరణ్, సాంబ మూర్తి, కర్ని రమణ, పాపారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌతు శిరీష

కిరణ్‌చంద్‌కు నివాళి

సోంపేట: పట్టణానికి చెందిన మల్లారెడ్డి కిరణ్ చంద్ ఆరుగురికి అవయవ దానం చేసి కారణ జన్ముడుగా నిలిచిపోయి మన మధ్యలోనే ఉన్నాడని ఎంపిపి డాక్టర్ ఎన్.దాసు అన్నారు. కిరణ్ చంద్ 16వ జయంతిని పురస్కరించుకుని అతడి తల్లిదండ్రులు మోహన్, కళ్యాణి జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శిబిరంలో వైద్యులు కె.సాహిత్య, నవ్య, బి.తేజ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ముందుగా కిరణ్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నగిరి ప్రభావతమ్మ, ఉప సర్పంచ్ మల్లా వెంకటరమణ, తిరుపతి, క్రాంతి, శ్రీను, షణ్ముఖరావు పాల్గొన్నారు.



చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎంపిపి దాసు

వంట సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- కొత్తూరు

జగన్నన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వంట సామగ్రి చేరుకుంది. దీనిని వైసిపి జిల్లా కోశాధికారి, నియోజకవర్గ నాయకులు లోతుగెడ్డ. తులసీవరప్రసాదరావు మధ్యాహ్నం భోజనం వంట కార్మికులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి విద్యార్థులకు మధ్యాహ్నం పౌష్టికాహారమైన భోజనాన్ని అందిస్తున్నారని, దీనిని సక్రమంగా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధి సవర రమేష్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితులు ఎ.ప్రశాంత్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు ఎ.గోవిందరావు, విద్యాకమిటీ చైర్మన్ వడమ శ్రీను పాల్గొన్నారు.



టెక్కలి : ప్రశంసాపత్రాలను అందజేస్తున్న హెచ్‌ఎం శోభారాణి


క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి- పలాస

శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాలలోని సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో కొన్ని చిన్నారావు మెమొరియల్ పేరిట 29వ ఓపెన్ జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో పలాసకు చెందిన కిశోర్ స్కూల్స్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్‌కు చెందిన క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబర్చారని కోచ్ ఎం.ఢిల్లీశ్వరరావు తెలిపారు. బాలుర విభాగంలో పలాసకు చెందిన డి.శివసాయి కుమార్ బంగారు పతకం, జె.సాత్విక్ 25 కేజీల వెండి, బి.గీక్షత్ 35 కేజీల రజిత పతకం, బాలికల విభాగంలో డి.యాశ్విన్ 55 కేజీల వెండి పతకం సాధించారని తెలిపారు. విజేతలను చీఫ్ కోచ్ నర్సిపురం శేఖర్ అభినందించారు.

టెక్కలి : టెక్కలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి కానూరు యామిని చిన్నారావు మెమోరియల్ అథ్లెటిక్స్ టోర్నమెంట్‌లో పాల్గొని బంగారు పతకాన్ని సాధించిందని ప్రధానోపాధ్యాయులు నౌపడ శోభారాణి తెలిపారు. యామిని 5 వేల మీటర్ల పరుగుపందెంలో పాల్గొని జిల్లాస్థాయిలో ప్రథమస్థానం సాధించి బంగారు మెడల్ సాధించిందన్నారు. యామినికి హెచ్‌ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు బి.ఆదిశేషుని, అభినందించారు.

పొందూరు: శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన కొన్న చిన్నారావు మెమోరియల్ చాంపియన్ షిప్-23 జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మండలం లోలుగు కెజిబివి విద్యార్థినిలు ఎం.ద్రాక్ష, కె.జానకి తమ ప్రతిభను కనపర్చారు. అథ్లెటిక్స్ పోటీలకు సంబంధించి కె.జానకి షాట్‌పుట్‌లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఎం.ద్రాక్ష షాట్‌పుట్‌లో రెండో స్థానం, జావెలిన్ త్రోలో రెండో స్థానం సాధించింది. ప్రతిభను కనబర్చిన విద్యార్థినిలకు ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య, వ్యాయామ ఉపాధ్యాయులు మొకర రూపవతి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

సరుబుజ్జిలి : మండలంలోని చిన్నకాకితాపల్లి హైస్కూల్‌లో 40 ఏళ్ల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. 1982-83లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఒకచోట కలిసి ఆనందంగా గడిపారు. అనంతరం అనాటి గురువులు జోగయ్యశాస్త్రికి పాదాభివందనలు చేశారు. ప్రస్తుత హెచ్‌ఎం చెంచల తవిటినాయుడుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల వెలమల రమణ, శీపాన శశి, పప్పల వెంకటనర్సింగరావు, ఎచ్చెర్ల సూర్యనారాయణ, పైడి రాము, శ్రీను, భువనేశ్వర్, జీవరత్నం, లక్ష్మి, సుధ, లీలావతి, కృపారాణి, రోహిణి, సూర్యకుమారి పాల్గొన్నారు.

రోటరీ సేవలకు గుర్తింపు

సోంపేట: సోంపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపు లభించిందని రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల కాలంలో చేపట్టిన కార్యక్రమాలను గుర్తించి డైమండ్ అవార్డు ప్రకటించారని తెలిపారు విశాఖపట్నంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో రోటరీ అంతర్జాతీయ ట్రస్టు వైస్ చైర్మన్ భరత్ పాండ్యా చేతుల మీదుగా సోంపేట రోటరీ క్లబ్‌కు డైమండ్ అవార్డు బహుకరించారని చెప్పారు. స్థానిక రోటరీ సభ్యులు సహకారంతో భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. రోటరీ సెక్రెటరీ పి.వి.కృష్ణారావు, సభ్యులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

సంక్షేమ పథకాలకు ప్రజాదరణ

ఎమ్మెల్సీ నర్తు రామారావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ఆదరణ పొందిందని, ఆందుకే ప్రజలు స్వచ్ఛందంగా సామాజిక సాధికారిత బస్సు యాత్రకు తరలివచ్చారని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. జనాదరణ చూసి ఓర్వలేని ఎమ్మెల్యే అశోక్ లేని పోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఇచ్ఛాపురంలో వైసిపి జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో జెసిఎస్ కన్వీనర్ సాలీన ఢిల్లీ, పట్టణ అధ్యక్షులు ప్రకాశరావు పట్నాయక్, వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య, లాభాల స్వర్ణమణి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు పాల్గొన్నారు.



జిఒను చూపిస్తున్న రమణమూర్తి

టిడిపి హయాంలోనే హార్బర్‌కు కృషి

ప్రజాశక్తి- నరసన్నపేట

టిడిపి హయాంలోనే భావనపాడు ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు కృషి చేశామని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సంబంధిత జిఒ కాపీని సోమవారం విలేకరులకు చూపించారు. ఈ సందర్భంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కృషి చేస్తున్నారని అన్నారు. పార్లమెంట్‌లోనూ తనకంటూ ఒక ప్రత్యేకత సంతరించుకున్న రామ్మోహన్ నాయుడుపై మంత్రి సీదిరి అప్పలరాజు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. 2018లో భావనపాడు హార్బర్ నిర్మాణానికి రూ.630 కోట్లు నిధులు కేటాయించేందుకు నిర్ణయం తీసుకుందని అన్నారు. అదే హార్బర్‌ను ప్రస్తుత ప్రభుత్వం మూలపేటలో రూ.700 కోట్లు కేటాయించి నిర్మిస్తున్నారని అన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ ఈశ్వరరావు

పాఠశాలతోనే విద్యార్థుల భవిష్యత్

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

విద్యార్థుల భవిష్యత్ ప్రాథమిక పాటశాలతోనే ప్రారంభమవుతుందని, ప్రతి పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని, విద్యార్థుల ఎదుగుదలకు మనందరం కృషి చేయాలని లావేరు మండల విద్యాశాఖాధికారి లండ ఈశ్వరరావు అన్నారు. యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండియా లిటరసీ ప్రాజెక్టు (ఐఎల్‌పి) బెంగుళూరు సహకారంతో నిర్వహించబడుతున్న స్కూల్ రెడీనెస్, బాలవికాస్ ప్రోగ్రాంలో సోమవారం పాల్గొన్నారు. రణస్థలం, లావేరు, పొందూరు, జి.సిగడం మండలాల్లో 1,2 తరగతులకు బోధిస్తున్న 55 ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు కృత్యాధార బోధన పద్ధతులను ఆటపాటలతో, అభినయ గేయాలతో రెండు రోజులు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శోధన సంస్థ రిసోర్స్ పర్సన్ ఉపాధ్యాయులకు శిక్షణ అందించారని సంస్థ డైరెక్టర్ యం.ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కోశాధికారి జి.అప్పలనాయుడు, లెర్నింగ్ కో-ఆర్డినేటర్ టి.కరుణాకరరావు, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ పి.మాధవి, సంస్థ కమిటీ సభ్యులు ఇ.అప్పారావు, విశ్వనాథం, ప్రాజెక్ట్ అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ వై.శంకరరావు, కమ్యూనిటీ ఆర్గనైజర్స్ అడపా రమణమూర్తి, కె.శ్రావణి, ఆర్.కల్పన, ఆర్.వనిత, జి.హేమసుందర్, అప్పలనాయుడు పాల్గొన్నారు.



డిఎస్‌పికి వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

కొమ్మలు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

టెక్కలి : పట్టణ పాత జాతీయ రహదారి మధ్యలోని పలు చెట్ల కొమ్మలు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి కోరారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ నూరల్ కమర్, డిఎస్‌పికిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోనిఈ చెట్లు వల్ల నీడ నిచ్చేదని అన్నారు. అటువంటి చెట్ల కొమ్మలను పుట్టినరోజు ఫ్లెక్సీల కోసం నరకడం దుర్మార్గ చర్య అని అన్నారు. గతంలో తమ పార్టీ అధ్యక్షులు కింజరాపు ఆచ్చెన్నాయుడు జన్మదిన సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే... ట్రాఫిక్‌కు అంతరాయం కల్పిస్తున్నారని వాటిని తొలగించారని గుర్తు చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో పట్టణ అధ్యక్షులు కోళ్ల లవకుమార్, రెయ్యి ప్రీతీష్‌చంద్, దల్లి ప్రసాద్‌రెడ్డి, అభి, ప్రపుల్ల కుమార్, కిరణ్, దుర్గారావు, లక్ష్మణ్, ఉమ ఉన్నారు.



తాతయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న రవికుమార్

కార్యకర్త కుటుంబానికి అండ

ప్రజాశక్తి- పొందూరు

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుతో తీవ్ర మనస్థాపానికి గురై మృతి చెందిన వడ్డి తాతయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉటుందని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండలం కింతలి పంచాయతీ ఖాజీపేటలో ఇటీవల మృతిచెందిన టిడిపి కార్యకర్త వడ్డి తాతయ్య కుటుంబాన్ని సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ ఎంతో కష్టపడి పనిచేసిన కార్యకర్తని, చంద్రబాబు నాయుడును అమితంగా అభిమానించే వడ్డితాతయ్య చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడంతో తీవ్ర మనస్థాపానికి గురై మృతిచెందాడని తెలిపారు. ఈయన కుటుంబాన్ని చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి పరామర్శించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈయనతో పాటు గ్రామ సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు, అసిరినాయుడు, రమణ ఉన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు

స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

నవరత్నాలతో సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు వస్తున్నాయని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సోమవారం మండలంలోని చింతలపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుండి సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్దిని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. ప్రజల పట్ల, వారి సమస్యల పట్ల చిత్తశుద్ధితో సిఎం జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు. సచివాలయాలు, వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను పారదర్శకంగా ప్రజలకు



పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న స్పీకర్ సీతారాం

అందిస్తున్నారన్నారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మండల సచివాలయాల కన్వీనర్ బొడ్డేపల్లి నిరంజన్ బాబు, ఎంపిడిఒ ఎస్. వాసుదేవరావు, మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు, ఇఒపిఆర్‌డి దుంపల గోవిందరావు, ఎలక్ట్రికల్ ఎఇ రవికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ చంద్రమౌళి, వైసిపి నాయకులు పేడాడ వెంకటరమణ, మల్లేశ్వరరావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బలదలో...

కొత్తూరు : మండలంలోని బలద, కొళ్లాపురం గ్రామాల్లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి గడప గడప కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సారిపల్లి ప్రసాదరావు, సర్పంచ్ భారతి, పిఎసిఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, ఆనందరావు, బి.శ్రీను, ఎల్.తిరుపతిరావు పాల్గొన్నారు.

యాత్రికులు మోసపోవద్దు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రసిద్ధ వైష్ణవ ఆలయంగా వెలుగొందుతున్న శ్రీకూర్మనాథస్వామి దేవాలయంలో ప్రత్యేక సేవలంటూ గతంలో ఆలయంలో జూనియర్ అసిస్టెంటుగా పనిచేసిన పెంట నాగేశ్వరరావు యాత్రికుల వద్ద నుంచి అక్రమ పద్ధతిలో డబ్బులు వసూలు చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, ఆయన మాటలు నమ్మి యాత్రికులు మోసపోవద్దని ఆలయ ఇఒ జి. గురునాథ్ తెలిపారు. సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యాత్రికుల నుంచి వస్తున్న ఫిర్యాదుల ఆధారంగా అయనపై గతంలో పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని, పోలీసు విచారణతో పాటు శాఖా పరమైన విచారణ జరిపి నిజ నిర్ధారణ కావడం వలన ఆయనను విధులనుంచి తొలగించడం జరిగిందని తెలిపారు. చంద్రగ్రహణం వేళ తిరిగి విశాఖకు చెందిన దేవాదాయ శాఖ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులనుంచి తిరిగి డబ్బులు వసూలు చేసినట్టు ఫిర్యాదు అందిందని, అయితే ఆయనకు దేవాలయ అధికారులకు ఎటువంటి సంబంధంలేదని వివరించారు.

జగన్‌ను గద్దె దింపడమే లక్ష్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

జగన్ మోహన్‌రెడ్డిని గద్దె దింపడమే మనందరి ఏకైక లక్ష్యం కావాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కూన రవికుమార్ అన్నారు. సోమవారం కొర్లకోట రోడ్డులో శ్రీనివాస కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా బూర్జ మండలం పెద్దలంకాం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మామిడి వెంకట సూర్యం, అయ్యవారిపేట గ్రామానికి చెందిన వైసిపి వార్డు మెంబర్ ఇప్పిలి శ్రీధర్ రవికుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనతో ప్రతిపక్షాలను, ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తూ వ్యవస్థలను చిన్నాభిన్నం చేస్తూ సైకో ఆనందం పొందుతున్న సిఎం జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపే సమయం ఆసన్నమైందన్నారు. నవంబర్ 1న నియోజకవర్గంలో నిర్వహించనున్న నారా భువనేశ్వరి "నిజం గెలవాలి", బాబు ష్యూరిటీ,



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

భవిష్యత్తుకు గ్యారంటీ, ఓటర్ల జాబితా పరిశీలన, కుటుంబ సాధికారికతో మహిళలకు బాధ్యత వంటి కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, టిడిపి నాయకులు పిఎంజె బాబు, బోయిన గోవిందరాజులు, పేడాడ జనార్ధనరావు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షులు తమ్మినేని సుజాత, మండల పార్టీ అధ్యక్షుడు నూకరాజు, సనపల ఢిల్లేశ్వరరావు, మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, బోనెల అప్పారావు, రాడ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'కిడ్స్ కేర్' ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పిల్లల్లో ఆటిజంతో బాధపడుతున్న వారికి కిడ్స్ కేర్ ద్వారా సేవలందిస్తున్నట్టు సిఇఒ ఎస్.పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం నగరంలోని పెదపాడు రోడ్డులో ఆటిజంకు సంబంధించి ఏ కిడ్స్‌కేర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సన్‌రైజ్ హోటల్‌లో పిడియాట్రిషన్ డాక్టర్స్ మీట్ నిర్వహించి మాట్లాడుతూ ఏ కిడ్స్‌కేర్ సంస్థ మొదటిసారిగా విజయనగరంలో ప్రారంభించి 14 నెలల్లో పూర్తయిందని, రెండవ సెంటర్‌గా ఏ కిడ్స్‌కేర్ శ్రీకాకుళంలో అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. కార్పోరేట్‌కు దీటుగా ఏ కిడ్స్‌కేర్ సెంటర్‌లో బిహేవియర్ థెరఫీ, అక్యుపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపీ వంటి ప్రత్యేక సదుపాయాల ద్వారా పిల్లలకు అర్థవంతమైన, ప్రత్యేకమైన బోధన అందించడం జరుగుతుందన్నారు. వ్యాపార దృక్పథంతో కాకుండా సేవాభావంతో పిల్లల్లోని నేర్పరితనం రావడానికి తగిన "థెరపీలను" అందిస్తామని తెలిపారు. ఆటిజం ఇతర



సదస్సులో కిడ్స్ కేర్ సిఇఒ పవన్ కుమార్

రుగ్మతల ద్వారా ప్రభావితమైన వ్యక్తికి చికిత్స చేయడానికి ప్రత్యేక శిక్షణ కలిగి ఉంటుందన్నారు. ఆటిజం అంటే బిడ్డ పుట్టినప్పటినుంచి ప్రతిరోజు ఏదో ఒక కొత్త విషయం నేర్చుకుంటారని, పాకడం, నిలబడడం బోర్లా పడడం, ఇలా ప్రతిదీ తల్లిదండ్రులకు ముచ్చటే అని కొంతమందిలో అలాంటి లక్షణాలు కనిపించక పోవడమే ఈరుగ్మత లక్షణమన్నారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య నిపుణుల సంఘం ప్రధాన కార్యదర్శి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి డా వినోద్ కుమార్ మాట్లాడుతూ మాట్లాడుతూ నేటి తరం పిల్లలను, కుటుంబాలను నేరుగా ఇబ్బంది పెడుతున్న అటిజం గురించి, సమాజంలో మరింత అవగాహన రావాలన్నారు. సకాలంలో స్పందించి చికిత్స పొందితే మేలు జరుగుతుందన్నారు.



టిడిపిలోకి ఆహ్వానిస్తున్న లక్ష్మీదేవి

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నియోజక వర్గం పరిధిలో బోరవానిపేట పంచాయతీ తాళ్ళవలస గ్రామానికి చెందిన పలువురు వైసిపి కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి సమక్షంలో సోమవారం టిడిపిలో చేరారు. వారికి ఆమె పసుపు కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో గడచిన నాలుగున్నరేళ్లుగా జగన్ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, నియోజక వర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు లోపింటి రాధాకృష్ణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జల్లు రాజీవ్, జిల్లా వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పొట్నూరు కృష్ణమూర్తి, మాజీ ఎంపిపి పుల్లటి నాగేశ్వరావు, మాజీ సర్పంచ్ మల్ల అబ్బాయి నాయుడు, జిల్లా ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి గోర సురేష్ పాల్గొన్నారు.

అదిగో పులి... ఇదిగో తోక

సోషల్ మీడియాలో ప్రచారంతో ఆందోళన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉద్దానంలో ఎలుగుబంట్లు సంచారం, ఎలుగు దాడి ఘటనలతో ఆందోళన చెందుతున్న ప్రజలకు సోషల్ మీడియాలో మరో పిడుగులాంటి ప్రచారం కలవరపాటుకు గురి చేస్తుంది. ఇటీవల ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పులి సంచారం ఆనవాళ్లు, పులి అడుగుల ముద్రలు కనుగొన్నారు. దానిపై అటవీశాఖ అధికారులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. తాజాగా వజ్రపుకొత్తూరు మండలం సముద్ర తీర ప్రాంతంలో కొత్తపేట, దిబ్బవానిపేట దేవునల్తాడ పరిధిలో పులి సంచరిస్తుందని సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. దీంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. ఉద్దానంలో ప్రజలు ఎక్కువగా జీడి, కొబ్బరితోటల్లో పనులు చేస్తుంటారు. పులి సంచారం నిజమైతే ప్రమాదమని భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై అటవీశాఖ అధికారి మురళీకృష్ణ నాయుడును వివరణ కోరగా వజ్రపుకొత్తూరులో పులి



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పులి ఫొటో (వృత్తంలో)

సంచారం అవాస్తవమన్నారు. అయినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండడం మంచిదన్నారు. పులి పాదముద్రలు కవిటి మండలం జగతి, రంగాలగెడ్డ వద్ద కనిపించాయని, అక్కడ నుండి ఇచ్ఛాపురం మండలం పత్రిపుట్టుగ ప్రాంతానికి చేరినట్లు తెలుస్తుందన్నారు. ఒడిషాకు 5 కిమీ దూరంలోని పత్రిపుట్టుగలో పులి కాలిముద్రలు గుర్తించడం జరిగిందన్నారు. సోషల్ మీడియాలో ప్రచారంతో భయాందోళన చెందవద్దని, ఏదైనా పులి సంచార ఆనవాళ్లు కనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.



పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న నాయకులు

రీ సర్వేతో రైతులకు మేలు

కవిటి: రీ సర్వేతో రైతులకు మేలు చేకూరుతుందని ఎఎంసి వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య అన్నారు. మండలంలోని భైరిపురంలో సోమవారం రీ సర్వే పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 489 మంది రైతులకు పాస్ పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పుల్లట జగదీష్, పిరియా ఆనందరావు, వై.సత్యం, పిరియా వైకుంఠరావు, పి.రామ్‌ప్రసాద్, పి.సత్యనారాయణ, బి.కీర్తిరావు, కె.సాయి పాల్గొన్నారు.

జంతువు దాడిలో ఆవు మృతి!

సోంపేట : మండలంలోని మామిడిపల్లికి చెందిన సోర్ర రామారావుకు ఆవుపై ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని జంతువు దాడి చేయడంతో మృతి చెందింది. రాత్రి ఇంటి



మృతి చెందిన ఆవు

సమీపంలో కట్టి ఉంచిన దూడ సోమవారం ఉదయం చూసేసరికి తీవ్రంగా గాయపడి మృతి చెందిందని అన్నారు. తల, మెడ భాగంలో తీవ్రమైన గాయాలు చూసి ఏదో గుర్తు తెలియని అడవి జంతువు దాడిలోనే మృతి చెందినట్లు భావిస్తున్నట్లు చెప్పారు. కొద్ది కాలం క్రితం నుంచి గుర్తు తెలియని అడవి జంతువుల దాడిలో పశువులు మృతి చెందాయని అన్నారు. అటవీశాఖ అధికారులు నిఘా పెట్టి తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని వారంతా కోరుతున్నారు.

స్పీకర్ పదవికి తమ్మినేని కళంకం తెచ్చారు

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గ శాసనసభ్యునిగా గెలిచి రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఎన్నికై రాజ్యాంగబద్ధ పదవిలో ఉంటూ వైసిపి కార్యకర్తగా వ్యవహరిస్తున్న తమ్మినేని సీతారాం ఆ పదవికి కలంకం తెచ్చారని తెలుగుశక్తి రాష్ట్ర అధ్యక్షులు బి.వి.రామ్ అన్నారు. సోమవారం తెలుగుశక్తి ప్రజా చైతన్య యాత్రలో భాగంగా పట్టణంలో గత టిడిపి ప్రభుత్వానికి నేటి వైసిపి ప్రభుత్వానికి గల తేడాను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కూన రవికుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నామని, రహదారులు అధ్వానంగా ఉన్నాయన్నారు. వైసిపి నాయకులకు వ్యతిరేకంగా ఉంటే కేసులు తప్పవని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో రవికుమార్‌ను గెలిపిస్తామని ప్రజలు తమ సర్వేలో తెలిపారన్నారు.



మాట్లాడుతున్న బి.వి రామ్

ప్రజా క్షేత్రంలో ప్రజలను రక్షించాల్సిన పోలీసులు సైకో ఆదేశాలను అనుసరిస్తూ చట్టాలను తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. చంద్రబాబు కోసం రాష్ట్రంలో యువకులందరూ సైకో పాలనపై తిరుగుబాటు చేసి ప్రజాకోర్టులో జగనాసురుడితో పాటు వైకాపా దొంగల ముఠా నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంటరీ టిడిపి కార్యదర్శి బోడెపూడి ప్రసాద్, డాక్టర్ పపూర్ నికుస్జ్, ఎం.చరణ్ కుమార్ ఉన్నారు.

భూ కబ్జాల మంత్రి అప్పలరాజు

పలాస: దశాబ్దాలుగా ప్రజాసేవలు చేస్తున్న గౌతు, కింజరాపు కుటుంబాలను విమర్శించే అర్హత లేదని, రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు భూకబ్జాల మంత్రి అని టిడిపి నాయకులు విఠల్, బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, లొడగల కామేష్ యాదవ్ ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. టిడిపి పాలన కాలంలో శంకుస్థాపనలు చేసిన వాటిని నేడు మంత్రిగా ప్రారంభించి ప్రగల్బాలు పలుకుతున్నారని అన్నారు. మంత్రి హయాంలో ఒక్క అభివృద్ధి పనులను పూర్తి చేశారా? అని ప్రశ్నించారు. ఎంపీ నిధులతో పలాస నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తామంటే మంత్రి అధికారులను బెదిరించి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. శివారు భూముల రైతులకు నాలుగేళ్లుగా వంశధార నీరు అందించడంలో విఫలం చెందారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే శివాజీ పలాస, మందస తహశీల్దార్ కార్యాలయాలను పూర్తి చేస్తే... వాటిని మంత్రి ప్రారంభించారని గుర్తు చేశారు. సమావేశంలో గురిటి సూర్యనారాయణ, మల్లా శ్రీనివాసరావు, అంబటి కృష్ణమూర్తి, చిట్టిబాబులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

ప్రజాశక్తి- కవిటి

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అశోక్ చేసిన అభివృద్ధి పనులపై చర్చకు సిద్ధమా? అని టిడిపి నాయకులు మణిచంద్ర ప్రకాష్, సీపాన వెంకటరమణ, పొందల కృష్ణారావు వైసిపి నాయకులకు సవాల్ విసిరారు. మండలంలోని రామయ్యపుట్టుగలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. బహిరంగ చర్చకు సమయం, సందర్భం వారు చెప్పినా సరే మమ్మల్ని చెప్పమన్నా సరే చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. కానీ, వైసిపి నాయకులు చర్చకు రాకుండా దొడ్డిదారిలో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ప్రతి ఓటరు మదిలో బెందాళం అశోక్ ఎప్పుడో చోటు సొంతం చేసుకున్నారని అన్నారు. ఇక అవినీతిపై మాట్లాడే హక్కు, అధికారం వైసిపి నాయకులకు లేదని అన్నారు. సమావేశంలో బెందాళం రమేష్, బాసుదేవ్ రౌలో, బెందాలం విజయ్, పుల్లట సంతోష్, బార్ల చినబాబు, రాజు, రంగారావు, మణి, లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ రవిసుధాకర్

బాల్య వివాహాలతో సమాజానికి చేటు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆధునిక సమాజంలో బాల్యవివాహాలు అభివృద్ధికి విఘాతమని మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల్లో భాగంగా బాల్య వివాహాల నిర్మూలనపై సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. కొందరు తల్లిదండ్రులు చేస్తున్న అనాలోచిత బాల్య వివాహాల నిర్ణయాలతో సమాజానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. ఈ దిశగా ప్రభుత్వం నిర్దేశించిన వయోపరిమితికి లోబడి మాత్రమే వివాహాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల్లో విరివిగా అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ లక్ష్మీనారాయణ బిశోయ్, సిహెచ్ శ్రీనివాసరావు, ఎవి శ్రీనివాస్, వార్డు సచివాలయ పరిపాలనా, ఆరోగ్య, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- టెక్కలి

విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గం స్థానిక సంఘ భవనంలో సోమవారం ఎన్నుకుంది. అధ్యక్షునిగా రోణంకి రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా ఎ.ధర్మారావు, కోశాధికారిగా బి.మోహనరావు, అసోసియేట్ అధ్యక్షులు ఎం.ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.శాంతారావు, బాబూరావు, సంయుక్త కార్యదర్శిగా జి.వి.రమణమూర్తిలను ఎన్నుకున్నారు. ఆనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేపట్టి టెక్కలి ఉపఖజానా అధికారులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీని అభినందించారు.

నేడు మున్సిపల్ సమావేశం

పలాస: పలాస మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు పలాస మండల సమావేశం

పలాస : పలాస మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉంగ ప్రవీణ అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎన్. రమేష్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి విధిగా ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పూర్తి సమాచారంతో అధికారులు హాజరుకావాలని సూచించారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం

ఇచ్ఛాపురం : పురుషోత్తపురం ఒకటో వార్డులో నివాసం ఉంటున్న జామి జోగమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. పేద కుటుంబ కావడంతో వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్ ఆమె దహన సంస్కారాలకు రూ.3 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సుగ్గు కామరాజు, నందేష్, భీమరాజు, రెండో వార్డు కౌన్సిలర్ ప్రతినిధి చాట్ల తిరుపతి, కృష్ణ పాల్గొన్నారు.

విలువకు ప్రతిరూపం 'హెన్రీ డునాంట్'

శ్రీకాకుళం అర్బన్ : మానవతా విలువలకు రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డునాంట్ ప్రతిరూపమని, ప్రపంచ వ్యాప్తంగా రెడ్‌క్రాస్ విస్తరించడానికి ఆయన ఆలోచనలే కారణమని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు పేర్కొన్నారు. హెన్రీ డునాంట్ వర్ధంతిని పురస్కరించుకుని బ్లడ్ బ్యాంకులో ఉన్న విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెన్రీ డూనాంట్ జెనీవాలో కాల్వినిస్ట్ కుటుంబంలో 1828, మే 8న జన్మించారన్నారు. ఆయన మానవతావాది, వ్యాపారవేత్త, సామాజిక కార్యకర్త, రెడ్‌క్రాస్ ఉద్యమ సహ వ్యవస్థాపకుడన్నారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా 1901లో మొదటి నోబెల్ శాంతి బహుమతి లభించిందన్నారు. ఉత్తర ఇటలీలోని సోల్ఫెరినో యుద్ధ సమయంలో క్షతగాత్రులకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు బి.చిన్మయరావు, మేనేజర్ ఎ.నరసింగరావు, బేగమ్, పెంకి చైతన్యకుమార్, కె.సత్యనారాయణ, బి.సతీష్, సూర్యప్రకాష్, సుజాత, పావని చందు, భాగ్య భారతి, బాబ్జీ, సుమతి పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘం

జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధర్మారావు

పొందూరు: ప్రభుత్వ ఫెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన అంకం ధర్మారావు ఎన్నికయ్యారు. ఆదివారం టెక్కలిలో నిర్వహించిన ఫెన్షనర్ల సంఘం జిల్లా ఎన్నికలో ధర్మారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈయన ప్రస్తుతం పొందూరు మండల ఫెన్షనర్ల సంఘం అధ్యక్షులుగా



ధర్మారావు

ఉన్నారు. ఈయన జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడం పట్ల పొందూరు, జి.సిగడాం మండలాల ఫెన్షనర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఫెన్షనర్లు సమస్యల పరిష్కారానికి ఈయన చొరవ చూపుతారనే ఆశాభావాన్ని వారంతా వ్యక్తం చేసారు.

రైలు ప్రమాదంపై దిగ్భ్రాంతి

శ్రీకాకుళం అర్బన్ : ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాద ఘటనపై యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రెల్ల సురేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో క్షతగాత్రులు, మృతుల కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు తాము అన్నివేళలా అండగా ఉంటామన్నారు. ప్రమాదం జరిగిన తీరుప్తై, సిగ్నలింగ్ వ్యవస్థ వైఫల్యంపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. క్షతగాత్రులకు ఇస్తున్న ఎక్స్‌గ్రేషియా పెంచడంతో పాటు వారికి ప్రభుత్వమే పూర్తిస్థాయి వైద్యం అందించాలన్నారు.

బిజెపి ఎస్‌టి మోర్చా

రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా దేవుడమ్మ

లావేరు : బిజెపి రాష్ట్ర ఎస్‌టి మోర్చా కార్యవర్గ సభ్యురాలుగా జి.జి.వలస గ్రామానికి చెందిన మీసాల దేవుడమ్మను బిజెపి అధిష్టానం నియమించింది. గిరిజన సాధారణ మహిళను రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించడం సామాన్యులపై బిజెపి చూపించే అభిమానానికి నిదర్శనమని విజయనగరం బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజ్జడ శ్రీనువాసురావు అన్నారు. దేవుడమ్మ నియామకంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరికి విజయనగరం జిల్లా అధ్యక్షులు నదుకుదిటి ఈశ్వరరావు, ఎన్ఇఆర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



దేవుడమ్మ